

సిద్ధరామేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

భిక్కనూరు, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆలయ హుండీని మంగళవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ సమక్షంలో లెక్కించారు. ఆ సందర్భంగా ఆలయ ఈవో శ్రీధర్ మాట్లాడుతూ మూడు నెలలకు సంబంధించి ఆలయంలోని హుండీలను లెక్కించగా రూ. 3,49,894 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి సదాశివమహంత్, ఆలయ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.





ఖాళీలపై ఆరా



- పోస్టుల భర్తీకి రాష్ట్ర సర్కారు కసరత్తు
- శాఖల వారీగా లెక్కలు తీస్తున్న ఉన్నతాధికారులు
- జిల్లాలో సుమారు 1,340 ప్రభుత్వ పోస్టుల ఖాళీలు
- త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్లకు సన్నాహాలు
- కామారెడ్డిలో 18 వేలకు పైగా నిరుద్యోగులు
- నిరుద్యోగ యువతలో నెలకొంటున్న ఆశలు

కామారెడ్డి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలలో ఖాళీల భర్తీకి కొత్త ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. తొమ్మిదిన్నర ఏళ్లుగా కొలువులు లేక నిరాశతో ఉన్న నిరుద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డి పాలన ప్రారంభం కావడంతో నిరుద్యోగుల ఆశలు చిగురించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో ఖాళీలను గుర్తించాలని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. దీంతో జిల్లాల వారీగా ఖాళీల వివరాలను నివేదించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రతీ శాఖలో అవసరమున్న సిబ్బంది ఎంత మంది ప్రస్తుతం ఉన్నవారు ఎంత మంది, ఎన్ని ఖాళీగా ఉన్నాయని వివరాలను సేకరించి అన్ని కోణాల్లో అధికారులు నివేదికలను రూపొందిస్తున్నారు. గతంలోనే శాఖల వారీగా ఖాళీలను నివేదించిన జిల్లా యంత్రాంగం మరోసారి వివరాలను సేకరిస్తోంది. జిల్లా స్థాయిలో 48 విభాగాల వరకు ఉండగా అటెండర్ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది లెక్కలు తీస్తున్నారు. దీంతో జిల్లాలోని నిరుద్యోగ యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో సుమారు 1340 ప్రభుత్వ ఉద్యోగాల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇవేకాకుండా మరికొన్ని శాఖల్లోనూ వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యా, వైద్య శాఖలతో పాటు పోలీసు శాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గతంలోనే అధికారులు గుర్తించారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాలకై, ప్రైవేట్ కొలువుల కోసం సుమారు 18 వేల మంది నిరుద్యోగ యువతి, యువకులు ఉపాధి కల్పన శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపడితే వీరిలో చాలా మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్‌లు వేయాలని నిరుద్యోగ యువతి, యువకులు కోరుతున్నారు.

ఉపాధి కోసం వేలాది మంది యువత ఎదురుచూపు

గత 10 సంవత్సరాలుగా గత ప్రభుత్వం అరకొర ఉద్యోగుల భర్తీ నోటిఫికేషన్ వేయడం ఎన్నికల నోటిఫికేషన్‌కు రాగానే వాటికి బ్రేక్ పడుతూ వచ్చింది. ఉపాధి కోసం జిల్లాలో వేల మంది యువతి, యువకులు ఎదురు చూస్తున్నారు. బీఈడీ, డీఎడ్ చేసిన అభ్యర్థులకు యేటా రెండు సార్లు టెట్ నిర్వహించినా డీఎస్సీ నోటిఫికేషన్ వేయలేదు. దీంతో ఉపాధ్యాయ వృత్తి కోర్సు చేసిన అభ్యర్థులు చాలా మంది వేచి చూస్తున్నారు. అదేవిధంగా పలు శాఖల్లోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను గతంలో తొలగించారు. వారంతా ఇప్పుడు ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నారు. ఇలా వేలాది మంది నిరుద్యోగ యువతి, యువకులు ఉపాధి కోసం వేచి చూస్తున్నారు.

జిల్లాలో 18 వేల మంది నిరుద్యోగులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో వేల మందికి పైగా నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆయా ఉపాధికల్పన కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలోని మూడు డివిజన్‌ల పరిధిలో సుమారు 18వేల మందికి పైగా నిరుద్యోగులు ఉపాధి కోసం ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో ఓసీలు 1,828 మంది ఉండగా, ఎస్సీలు 2,567, ఎస్టీలు 1,282, బీసీ ఏలో 1,254, బీసీ బీలో 3,272, బీసీ సీలో 48, బీసీ డీలో 3,561, బీసీ ఈలో 371 మంది నిరుద్యోగ యువతి, యువకులు కొలువుల కోసమై ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు పెట్టుకున్నారు. వీరే కాకుండా వికలాంగుల జాబితాలో బధిరులు 140 మంది, మూగ, చెవిటి వారు 119, కాళ్లు, చేతులు లేని వారు 1,544, మానసిక వికలాంగులు 11 మంది ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరే కాకుండా మరికొన్ని వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయా శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో 1,340 పోస్టుల ఖాళీలు

జిల్లాలో ఆయా ప్రభుత్వ శాలు, ప్రభుత్వరంగ సంస్థల్లో 1,340 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గతంలో ప్రభుత్వం విడుదల చేసింది. ఇవే కాకుండా మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యాశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సుమారు 840 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఎస్ఏ, ఎస్జీటీ పోస్టులు, భాష పండితుల పోస్టులు, పీఈటీలు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు మరో 21 ప్రభుత్వ శాఖల్లో వెయ్యికి పైగా ఉద్యోగపోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత సర్కారు కొలువుల కోసం ఇప్పటి నుంచే పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. గ్రంథాలయాలు నిరుద్యోగ యువతతో నిండిపోతున్నాయి. మరికొందరు కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు.

ప్రధానోపాధ్యాయుడి తీరుపై ఆందోళన

చర్యలు తీసుకోవాలని పోలీసులు, కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేసిన బీజేపీ, బీజేవైఎం నాయకులు

లింగంపేట, ఫిబ్రవరి 6: లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు శౌకత్‌అలీపై మంగళవారం లింగంపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ, బీజేవైఎం, ఆర్ఎస్ఎస్ నాయకులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలకు పీజీహెచ్ఎంగా ప్రమోషన్‌పై వచ్చిన శౌకత్అలీ ఆదివారం పాఠశాలలో పూజలు చేయరాదని పాఠశాల స్టాఫ్ గ్రూపులో మెసేజ్ చేయడంతో మండలంలో ఆ మెసేజ్ వివాదంగా మారింది. పాఠశాల ఆవరణలోని సరస్వతీ విగ్రహానికి గత 15 సంవత్సరాలుగా ప్రతీ శుక్రవారం విద్యర్థులు, ఉపాధ్యాయులు పూజలు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు కావాలని ఒక వర్గాన్ని అవమానపరుస్తూ సరస్వతీ విగ్రహానికి పూజలు చేయకుండా అడ్డుకుంటున్నాడని భావించి ప్రధానోపాధ్యాయుడు పెట్టిన మెసేజ్‌ను గ్రామానికి చెందిన ఇతర గ్రూపుల్లో పెట్టడంతో మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పోలీసులు ముందస్తుగా పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. మంగళవారం గ్రామానికి చెందిన బీజేపీ, బీజేవైఎం, ఆర్ఎస్ఎస్‌కు చెందిన నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హిందూ మతాన్ని అవమానపర్చడంతో పాటు, విద్యార్థులకు మత విషబీజాలను నాటుతున్నాడని అతనిపై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్సైకి ఫిర్యాదు చేశారు. పాఠశాలలో మతాన్ని రెచ్చగొడుతున్న ప్రధానోపాధ్యాయున్ని సస్పెండ్ చేయాలని కోరుతూ కలెక్టర్‌కు, డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్సై చైతన్యకుమార్‌ను వివరణ కోరగా విచారణ రిపోర్ట్‌ను కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులకు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



అవగాహన చేపడుతున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది

కుష్టుపై సమరం

- కుష్టు వ్యాధి నివారణకు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ స్పర్శ'
- జిల్లాలోని ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు
- కొనసాగుతున్న పక్షోత్సవాలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 6: కుష్టు అనే చర్మ సంబంధిత వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించక పోవడం వల్ల వ్యాధి తీవ్రంగా మారి అంగవైకల్యం వచ్చి మానసికంగా కుంగిపోతుంటారు. అంటు వ్యాధి కావడంతో సమాజంలో ఈ వ్యాధి సోకిన వారిని ఎవరు హక్కున చేర్చుకోక పోవడం వల్ల విగత జీవులుగా మారి మరణానికి దగ్గరవుతున్నారు. రోగులలో ఉన్న భయానకమైన పరిస్థితులను తీర్చడానికి వారి పట్ల ప్రజలు, దగ్గరి వారు సైతం చూపిస్తున్న చిన్న చూపును దూరం చేసి వారికి అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న ఆపరేషన్ స్పర్శ కార్యక్రమం ద్వారా జిల్లా వైద్యశాఖ అధికారులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఏడాది పక్షోత్సవాలు కొనసాగిస్తుండగా ఈ కార్యక్రమాలు జిల్లాలో విస్తృతంగా కొనసాగుతున్నాయి.

కుష్టు (లెప్రసీ) వ్యాధి ఎలా సంక్రమిస్తుంది

కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రి అనే క్రిమి ద్వారా సంక్రమిస్తోంది. అపరిశుభ్ర ప్రాంతాల్లో నివసించే వారికి ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. చిన్న, పెద్ద, మగ, ఆడ బేధం లేకుండా అందరికీ వచ్చే అవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన వ్యక్తి తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాపిస్తోంది. లాలాజలం ద్వారా రోగితో సన్నిహితంగా ఉన్నా సోకుతోంది. ముఖ్యంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నపిల్లలకు, వృద్ధులకు త్వరగా సోకే ప్రమాదముంటుంది.

వ్యాధి సోకిన వారికి కనిపించే లక్షణాలు.. చికిత్సా విధానం

ఈ వ్యాధి భారిన పడిన వ్యక్తికి శరీరంపై తెల్లని, ఎర్రని మచ్చలు ఉండడం, చేతులు, కాళ్లు తిమ్మిర్లు రావడం, దీర్ఘకాలం పుండ్లు మానకపోవడం, శరీర అవయవాలు రోజురోజుకూ కుచించుకుపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇట్లాంటి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలి. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ అయితే చికిత్సను ప్రారంభిస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి 1 నుంచి 5 మచ్చలు ఉంటే ఆరు నెలలు లేదంటే ఆరు కంటే ఎక్కువ మచ్చలు ఉండి నరాలు ఉబ్బి ఉంటే ఎన్‌డీటీ (బహుళ ఔషధ చికిత్స విధానంలో) 12 నెలల్లో ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. చికిత్సతో పాటు రోగులకు కావలసిన అన్ని మందులను అందిస్తారు. చికిత్సను పొంది మందులు వాడితే వ్యాధి తగ్గుముఖం పట్టి అందరి లాగే సాధారణ జీవనం కొనసాగించవచ్చని వైద్యులు తెలుపుతున్నారు. ప్రారంభంలోనే గుర్తించి, చికిత్స అందిస్తే అంగ వైకల్యానికి దారి తీయదు. ఒకవేళ అంగవైకల్యం కలిగినా శస్త్రచికిత్స ద్వారా సరి చేస్తారు. ప్రస్తుతం ఈ వ్యాధి సోకిన వారికి తగిన విధంగా చికిత్సను అందించేందుకు జిల్లా వ్యాప్తంగా కామారెడ్డి, గాంధారి, పిట్లం, బాన్సువాడ, రామారెడ్డి ప్రాంతాలలో వైద్యులు అందుబాటులో ఉంటు వ్యాధిగ్రస్తులకు చికిత్సలను అందిస్తున్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్నాం

● లక్ష్మణ్‌సింగ్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆపరేషన్ స్పర్శ ద్వారా అన్ని గ్రామాల్లో, పట్టణాల్లోని విద్యా సంస్థలు, స్వచ్ఛంధ సంస్థల సహకారంతో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి పక్షోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ వ్యాధి సోకిన వారికి చికిత్సను అందించేందుకు జిల్లాలోని 5 కేంద్రాలలో వైద్యులు అందుబాటులో ఉన్నారు.

క్వారీకి అనుమతులు ఇవ్వొద్దు



పొలాల్లో పడిన బండరాళ్లను చూపుతున్న బ్రహ్మాజీవాడి రైతులు

తాడ్వాయి, ఫిబ్రవరి 6: క్వారీ తవ్వకాలకు అనుమతులు ఇస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని బ్రహ్మాజీవాడి రైతులు హెచ్చరించారు. తాడ్వాయి మండలం అబ్దుల్లానగర్ శివారులో సర్వే నెంబర్ 125లో 3.34 ఎకరాల భూమిలో దోమ్మాటి కిష్టారెడ్డి పేరుపై అనుమతుల కోసం పైరవీలు చేస్తున్నారని తెలిపారు. మంగళవారం అబ్దుల్లానగర్ శివారులోని 125 సర్వే నెంబర్ భూమిలోకి వెళ్లి అదే ప్రాంతంలో వారు విలేకరులతో మాట్లాడారు. క్వారీ తవ్వకాల కోసం ఈ సర్వే నెంబర్‌లో అధికారులు అనుమతులు ఇస్తే తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతామని తెలి పారు. ఇప్పటికే కృష్ణాజీవాడి సమీపంలోని అబ్దుల్లానగర్ శివారులో ఉన్న కంకరమిషన్‌తో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు తెలిపారు. కంకరమిషన్ యాజమాన్యం ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంకరమిషన్ యాజమాన్యం భారీ బాంబులు పేలుస్తూ బండ రాళ్లను పేల్చుతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీ యాజమాన్యం జిలిటన్‌స్టిక్ బాంబులు పేలుస్తూ పెద్దపెద్ద బండ రాళ్లను పగులగొడుతున్నారని వివరించారు. బాంబులు పేల్చిన సమయంలో తాము తీవ్ర ఆందోళనకు గురవుతున్నామన్నారు. క్వారీకి అనుమతులు ఇస్తే పురుగుల మందు తాగి చనిపోతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజ శేఖర్, బాలయ్య, భూమయ్య, సాయిలు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ సునీతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అబ్దుల్లానగర్ శివారులోని 125 సర్వే నెంబర్‌లో క్వారీ తవ్వకాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారని అక్కడ క్వారీ తవ్వకాలకు అనుమతులు ఇవ్వమని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

● ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం
● మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం


ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 6: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ డిమాండ్ చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతదూ తొమ్మిదేళ్ల కాలంలో కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకుంటే.. మంత్రిగా వేముల ప్రశాంత్ రెడ్డి నాసీరకం చెక్‌డ్యాంలు ఆర్అండ్‌బి రహదారులంటూ కోట్ల రూపాయలు దండుకున్నారని వారు ఈ సందర్భంగా ఆరోపించారు. అంతేకాకుండా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బాల్కొండ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో వంద కోట్ల రూపాయలు ఖర్చు చేయడమే ఇందుకు ప్రత్యేక నిదర్శనమని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హమీలు నెరవేర్చడానికి సీఎం రేవంత్ రెడ్డి వంతులవారీగా అమలుకు కృషి చేస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు అధికారం దక్కలేదన్న అక్కసుతో అనాలోచితంగా నోరుపారేసుకుంటున్నారని ఆరోపించారు. 60వేల కోట్ల రూపాయల మిగులు ఉన్న రాష్ట్రాన్ని కోట్ల అప్పులోకి తీసుకెల్లి ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చేబితే ప్రజాతీర్పును గౌరవించాల్సింది పోయి, వారి తీర్పునే అపహస్యం చేస్తూ.. ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని వారు అన్నారు. ఎన్నికల్లో తప్పుడు ప్రొసిడింగ్ పత్రాలు ఇచ్చిన ఘనత ప్రశాంత్ రెడ్డిది కాదా అన్నారు. ఈవిషయమ్మై తగిన విచారణ ప్రభుత్వం జరిపిస్తుందన్నారు. సీఎం పై బాల్కాసుమన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, పాలెపు నర్సయ్య, నల్ల గఫేష్ గుప్త, బుచ్చిమల్లయ్య, శ్రీను, అజాహరోద్దీన్, మారయ్య, గణేష్ గౌడ్, గంగరాజం, హన్మంతు, నరేష్, ప్రసాద్, ప్రవీన్, జగదీశ్, దీపక్‌నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారి ఉత్తర్వులు బేఖాతర్!

● డిప్యూటేషన్‌ను రిలీవ్ చేయని హెచ్‌ఎం ● ఒక్కరి రిలీవింగ్‌తో పది మందికి స్థానచలనం ● విద్యాశాఖలో విచిత్రధోరణి

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 6 : జిల్లా విద్యాశాఖాధికారి డిప్యూటేషన్లలో కొనసాగుతున్న వారిని తమ స్వంత స్థానాలకు వెళ్లాలని ఉత్తర్వులు ఇచ్చినా ఆ ఉత్తర్వులను ప్రధానోపాధ్యాయులు పెడచెవిన పెడుతున్నారు. డిప్యూటేషన్లలో కొనసాగుతున్న ఉపాధ్యాయులను తమ యధాస్థానాలకు వెళ్లాలని ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఇటీవల జిల్లాలో డిప్యూటేషన్లపై కొనసాగుతున్న ఉపాధ్యాయులను తమ స్వంత స్థానాలకు వెళ్లాలని ఆదేశాలు ఇచ్చినప్పటికి వాటిని ప్రధానోపాధ్యాయులు తుంగలో తొక్కడం విద్యాశాఖలో చర్చనీయాంశమైంది. ధర్పల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న నాగమణి ప్రస్తుతం బోర్గాం(పి) పాఠశాలలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. బోర్గాం (పి)పాఠశాలలో విద్యార్థులు అధికంగా ఉండడంతో విద్యార్థులు తక్కువగా ఉన్న చోటు నుంచి ఆపాఠశాలకు ఉపాధ్యాయులను డీఈవో డిప్యూటేషన్‌పై వేశారు. ఆ పాఠశాలలో నలుగురు గణితం బోధించే ఉపాధ్యాయులు ఉండగా మిగత ఇద్దరిని డిప్యూటేషన్ వేశారు. మాజీ శాసన సభ్యుడు సిఫారసుతో డిప్యూటేషన్ వేయగా ప్రస్తుతం పదవ తరగతి సిలబస్ పూర్తయింది. ఇటీవల ధర్పల్లికి చెందిన ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతనిధులతో మాట్లాడి బోర్గాం(పి) పాఠశాలలో పనిచేస్తున్న సదరు ఉపాధ్యాయురాలిని రిలీవ్ చేయడం వల్ల 8నుంచి 10మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగే అవకాశం ఉంది. అయినప్పటికి బోర్గాం(పి)పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాశాఖ అధికారి ఆదేశాలను బేఖాతరు చేయడం విద్యాశాఖలో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థుల సిలబస్ పూర్తి కావడం, ప్రస్తుతం గణితం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు సైన్స్ టీచర్ అయినప్పటికి ఆ హెచ్‌ఎం వ్యవహార శైలి అంతుచిక్కని వ్యవహారంగా మారింది. డిప్యూటేషన్లు రద్దు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్న స్వయంగా జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన ఆదేశాలను సదరు ప్రధానోపాధ్యాయుడు నిర్లక్ష్యం చేయడంపై టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రధానోపాధ్యాయుడు కాగా.. ఇటీవల విద్యాశాఖలో బోర్గాం(పి)పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సదరు వ్యక్తి అన్ని తానై వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. టెక్నికల్ కోర్సు ఇంచార్జీతో పాటు ఇటీవల విద్యాశాఖలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో సదరు ప్రధానోపాధ్యాయుడు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. .

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి6: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సీహెచ్.తిరుపతి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మండలంలోని తొర్లికొండ గ్రామంలో సైబర్ నేరాల పట్ల గ్రామస్థులకు ఎస్సై సీహెచ్.తిరుపతిరెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు సైబర్‌నేరాలు, గంజాయి, మత్తుపదార్థాలు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సై సీహెచ్.తిరుపతి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై సుశీలకుమార్, పోలీసులు, తొర్లికొండ గ్రామస్థులు పాల్గొన్నారు.


కంఠేశ్వర్‌లో కిడ్నాపైన బాలుడి ఆచూకీ లభ్యం

● నిజామాబాద్‌లో బాలుడిని కిడ్నాప్ చేసి మోర్తాడ్‌లో వరదకాలువపై వదిలివెళ్లిన కిడ్నాపర్లు ● తల్లికి బాలుడిని అప్పగించిన పోలీసులు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 6: రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈనెల 5నకిడ్నాప్‌కు గురైన ఏడాదిన్నర బాలుడి గణేష్ ఆచూకీ లభ్యమైంది. నిర్మల్‌కు చెందిన యువతి నిజామాబాద్ కోర్టు చౌరస్తా వద్ద భిక్షాటన చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు బాలుడిని అపహరించారు. బాలుడి తల్లి ఫిర్యాదుమేరకు రూరల్ పోలీసులు రంగంలోకి దిగారు. స్పెషల్ టీంగాలింపులో బాలుడిఆచూకీ మోర్తాడ్ మండలంలోని ఓ కాల్వ పక్కన బాలుడిని గుర్తించారు. పోలీసులు గాలిస్తుండటంతో కిడ్నాపర్లు బాలుడిని వదిలివెళ్లారు. దాంతో పోలీసులు బాలుడిని తీసుకువచ్చిరూరల్ పోలీసు స్టేషన్‌లో బాలుడి తల్లికి అప్పగించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

మోర్తాడ్: మండల కేంద్రంలో పాలెం వరదకాలువ వద్ద బాలుడిని పోలీసుల అందిన సమాచారం మేరకు ఆ బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు దుర్గయ్య గ్రామంలో సేకరించిన చెత్తను వరదకాలువ ప్రాంతంలో డంప్ చేసేందుకు వెళ్లగా అక్కడ బాలుడు ఏడుస్తూ కనిపించాడు. దీంతో చుట్టు పక్కల ఎవరు బాలుడిని సంబంధించిన వారు లేకపోవడంతో ఆయన పిల్లవాణి తీసుకొని పోలీసులకు అప్పగించాడు. కాగా స్థానిక ఎస్సై అనిల్‌రెడ్డి ఈ పిల్లవాడు నిజామాబాద్‌లోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కిడ్నాప్ అయినట్లు తెలుసుకొని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, జ్యోతిలకు అప్పజెప్పారు. అయితే నిజామాబాద్‌లో మూడు రోజుల క్రితం పిల్లవాడు కిడ్నాప్ అయినట్లు కేసు నమోదు అయ్యిందని గుర్తించి ఐసీడీఎస్ అధికారి ఉషారాణి, అంగన్‌వాడి టీచర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆర్మూర్‌లోని ఏసీపీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఈ విషయం తెలిసిన నిజామాబాద్ రూరల్ పోలీసులు ఏసీపీ కార్యాలయానికి వచ్చి ఉన్నారు. బాలుడిని గుర్తించి నిజామాబాద్‌లో కిడ్నాప్ అయిన బాలుడిని నిజామాబాద్‌రూరల్ పోలీసులు తీసుకువెళ్లారు. జిల్లాలో ముగ్గురిని కిడ్నాప్ అయినట్లు పోలీసుల ద్వారా తెలిసింది. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సకాలంలో స్పందించిన ఎస్సై అనిల్‌రెడ్డిని, ఐసీడీఎస్ అధికారులు ఉషారాణిని ఏసీపీ పోలీసులు అభినందించారు.


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న రూరల్ పోలీసులు



బైక్‌ను ఢీకొట్టిన కారు

● ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి
● మృతులు మహారాష్ట్రలోని దెగ్లూర్ వాసులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 6 : కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ శివారులో మంగళవారం బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్ర లోని దెగ్లూర్‌కు చెందిన వెంకటేష్ శంబాజీ బన్సుడే(25), వాగ్మారే నిఖిల్ (20), సూర్యవంశీ సోంనాథ్‌లు ముగ్గురు చిన్ననాటిస్నేహితులు. వీరంతా వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. అయితే ఓ ఇంటి పని చేసేందుకు మంగళవారం కామారెడ్డిజిల్లాలోని పెద్ద కొడప్‌గల్ మండలం తలాబ్ తండా కు ముగ్గురు కలిసి బైక్‌పై బయలు దేరారు. మార్గమధ్యలో పెద్దకొడప్‌గల్ శివారులోని 161వ జాతీయ రహ దారిపై వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను హైదరాబాద్ నుంచి దెగ్లూర్ వైపు వెళుతున్న కారుఅతి వేగంతో బలంగా ఢీకొట్టింది.ఈఘటనలో వెంకటేష్ శంబా జీ బన్సుడే, వాగ్మారే నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా.. సూర్యవంశీ సోంనాథ్ గాయపడ్డాడు. ప్రమాద విషయం తెలియగానే బిచ్కుంద సీఐ జగడంనరేష్ ఘటనా స్థలికి చేరుకుని కారు కింది భాగంలో ఇరుక్కుపోయిన నిఖిల్ మృతదే హాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీయడానికి అధికార గణం తీవ్రప్రయత్నం చేసి చివరకు తీశారు. మృతుడి బంధువు యాదవ్ నివర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు.




భిక్కనూరు పర్మిట్‌రూంలో
మద్యం బాటిల్‌తో దాడి



ముత్యంనుఅదుపులోకి తీసుకుంటున్న పోలీసులు , గాయపడిన వ్యక్తి

భిక్కనూరు, ఫిబ్రవరి 6: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగన గొడవలో ఒకరు పక్కనే ఉన్న మద్యం బాటిల్‌ను పగులగొట్టి ఎదుటి వ్యక్తిపై దాడిచేసి పొడిచిన సంఘటన భిక్కనూరు మండలకేంద్రంలోని సిద్ధరామేశ్వర వైన్స్ పర్మిట్‌రూంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసు కుంది. ప్రత్యక్షసాక్షులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బత్తు పెద్ద ముత్యం, కర్నాల నరేష్ సిద్దరామేశ్వర వైన్స్ పక్కనే ఉన్న పర్మిట్‌రూంలో వేర్వేరుగా వారివారి స్నేహితులతో మద్యం తాగుతున్నారు. గత కొన్నిరోజుల క్రితం నరేష్ సెల్‌ఫోన్ దొంగతనానికి గురికాగా ఆ విషయంపై నరేష్ వారి స్నేహితులతో మాట్లాడుతుండగా పెద్దముత్యం నరేష్ వద్దకు వచ్చి కలుగజేసుకుని వాగ్వాదానికి దిగాడు.దింతో మద్యం మత్తులో ఉన్న ఇద్దరు సహనం కోల్పోయి ఒకరినొకరు దాడి చేసుకోగా పర్మిట్‌రూంలో పక్కనే ఉన్న మద్యం బాటిల్‌ను పగులగొట్టి పెద్దముత్యం నరేష్‌పై దాడి చేసి మెడ, చెవి వద్ద పొడిచాడు. దింతో నరేష్‌కు తీవ్రగాయాలై రక్తస్రావ మైంది. వెంటనే వైన్స్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందివ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన నరేష్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి, దాడికి పాల్పడిన పెద్దముత్యంను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.ఎస్సైమాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు







పసుపు రైతులకు మద్దతు ధర వచ్చేటట్టు చూడాలి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 6: ఢిల్లీలో మంగళవారం ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి నారాయణరాణి తాటినిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి కలిశారు. అనంతరం పసుపు రైతులకు మద్దతు ధర వచ్చేలా చూడాలని, పసుపు రైతుల సమస్యలు పరిష్కరించాలని, పసుపు పంటకు కేంద్రం ఎగుమతులు, దిగుమతుల ద్వారా పసుపు పంటకు అధిక మద్దతు ధర వచ్చేలా చూడాలని, భవిష్యత్‌లో పసుపుబోర్డు ఏర్పా టు చేసి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కేంద్ర మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా లోని కమ్మర్‌పల్లి, వేల్పూర్, ధర్పల్లి మండలాల్లో సైన్స్ పార్కు కొరకు నిర్ణయించిన భూముల్లో కమ్మర్‌పల్లిలో తప్ప ఏలాంటి పనులు జరగలేదని,ఈ మండలాల్లో భూములు పాడవుగా ఉన్నాయని భూములు కేంద్ర ప్రభుత్వం పసుపుబోర్డు ఏర్పాటు చేసిందని పాడవుగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పసుపు రైతులకు అండగా ఉండాలని కేంద్ర మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి కోరారు.


కేంద్ర మంత్రి కలిసిన తిరుపతిరెడ్డి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ఎడపల్లి, ఫిబ్రవరి 6: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ఉన్నత స్థాయిలో ఉంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తె. మీడియంను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉఆధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికలను ఆయన పరిశీలించారు. ఎఫ్ఎల్ఎస్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మహిళ ప్రాంగణం అధికారిపై విషప్రయోగం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి6: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ ప్రాంగణం జిల్లా అధికారిణి పద్మపై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విషప్రయోగం చేసినట్లు ఆమె తెలిపారు. మంగళవారం పెర్కిట్‌లోని మహిళ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మహిళ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సత్తెమ్మను సస్పెండ్ చేయగా మరో సిబ్బంది అలివేలుతో కలిసి విషప్రయోగం చేయడానికి పన్నగం పన్నారని పద్మ తెలిపారు. తాను తాగే జ్యూస్, అన్నంలో విషం కల్పడానికి అనితను వారు సంప్రదించగా విషయం బయటకు తెలియడంతో ఐదు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆమె తెలిపారు. తక్షణమే విషప్రయోగానికి ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

అలీసాగర్ గార్డెన్ పరిశీలన

ఎడపల్లి, ఫిబ్రవరి 6: ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామ శివారులోగల అలీసాగర్ ఉద్యానవనాన్ని మంగళవారం జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్డీవో పీడీ చందర్ నాయక్ ఆదేశాల మేరకు గార్డెన్‌లో చేపట్టిన పనులను పరిశీలించామని దాదాపు పనులు పూర్తి కావచ్చాయని ఆయన అన్నారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. రెండు నెలల క్రితం ఈదురు గాలులకు భారీ నష్టం వాటిల్లిందని వాటిని కూడా రిపేరు చేయించాలని ఏఈకి సూచించడం జరిగిందన్నారు. ఈ క్యాక్రమంలో ఆయన వెంట ఎంపిడిఓ గోపాల కృష్ణ, ఏపీఓ శ్రీవాణి తదితరులు ఉన్నారు.

పెద్దమల్లారెడ్డిలో కిడ్నాపర్ల సంచారం?

భిక్కనూరు,ఫిబ్రవరి 6: గ్రామ హైస్కూల్ పక్కన కారు ఆపి గ్రామంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని, వారు తప్పకుండా చిన్నపిల్లలను ఎత్తుకెళ్లే ముఠాసభ్యులని ఆనోట ఈనోట గ్రామంలో వ్యాపించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురై పోలీసులను ఆశ్రయించిన సంఘటన భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథ నం ప్రకారం దాదాపు సాయంత్రం ఐదు గంటల ప్రాంతం నుంచి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాల పక్కన హెచ్‌ఆర్ 28కె 0584 నెంబరు గల స్విఫ్ట్ కారు నిలిపి ఉండి అందులో ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. గ్రామానికి చెందిన యువకులు అతడి వద్దకు వెళ్లి మీకు ఎవరు కావాలి ఎక్కడి వచ్చారు అని ప్రశ్నించగా నేను గూగుల్ మ్యాప్ చూసుకుంటు ఇటువైపు వచ్చానని నేను హైదరాబాద్‌కు వెళ్లాలని సమాధానం ఇచ్చారు. మరి సాయంత్రం ఐదు గంటల నుంచి తొమ్మిది గంట వరకు ఇక్కడే ఎందుకున్నావు ఇటువైపు నుండి వెళ్తె హైదరాబాద్‌కు వెళ్లవచ్చునని ఎన్నిసార్లు చెప్పిన అతను అక్కడి నుంచి వెళ్లలేదు. అదే సమయంలో కంచర్ల గ్రామానికి వెళ్లె దారిలో మరో ఇద్దరు అనుమా నాస్పదంగా తిరుగుతున్నారని గ్రామంలోని వాట్సప్ గ్రూప్‌లలో చక్కర్లు కొట్టడం, ఈ వార్త గ్రామంలో వ్యాపించడంతో పెద్దఎత్తున యువకులు వారిని పట్టుకునేందుకు పొగవుతున్నారు. దీన్ని గమనించిన కారులో ఉన్న వ్యక్తి కారును చాలా స్పీడ్‌తో వెళ్లి మిగితా ఇద్దరిని సైతం కారులో ఎక్కిం చుకుని కంచర్ల వైపు పారిపోయారు. దీంతో గ్రామ యువకులు బైక్‌లపై వారిని ఫాలో అయిన వారు దొరకకపోవడంతో భిక్కనూరు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సమాచారం అందుకున్న భిక్కనూరు ఎస్సై పెట్రోలింగ్ సిబ్బందిని దోమకొండ, బీబీపేట పోలీసులను అలెర్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామం లోని ముగ్గురు అనుమానంగా కారులో వచ్చి గ్రామంలో అనుమా నాస్పదంగా తిరుగుతు న్నారని గ్రామస్థులు తమకు సమాచారం అందించారన్నారు. కంచర్ల వైపు వెళ్లిన వారిని పట్టుకోవడానికి మూడు టీంలను ఏర్పాటు చేయ్యడం జరిగిందన్నారు. ప్రజలు ఎవరు భయపడోద్దని,పెట్రోలింగ్‌ను గ్రామంలోముమ్మరం చేశామని సూచించారు.

పొతంగల్ సహకార సంఘంలో 9మంది డైరెక్టర్ల రాజీనామా

కోటగిరి,ఫిబ్రవరి6: రాష్ట్రంలోనే పేరుగాంచిన పొతంగల్ విశాల పరపతి సంఘం పాలకవర్గంలో మెజారిటీ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. పొతంగల్ సహకార సంఘం కార్యాలయంలో కార్యదర్శి భరత్‌కు మంగళవారం రాజీనామా పత్రాలను సమర్పించారు. రాజీనామా చేసిన వారిలో ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, లక్ష్మి, రూప్‌సింగ్, లింగాప్ప, చిన్న గంగారాం, చంద్రమ్మ, భగవన్ రావు, శ్రీనివాస్‌రావులు ఉన్నారు.

'బాల్క సుమన్‌ను వెంటనే అరెస్టు చేయాలి'

రాజంపేట, ఫిబ్రవరి 6: మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యాలను ఖండిస్తున్నామని అన్నారు. వెంటనే బాల్క సుమన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శశికాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై మంగళవారం బల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. బల్క సుమన్‌ను అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సర్పంచ్ రాంరెడ్డి, రఫీక్, పతియోద్దీన్, జొన్నల రాజులతో పాటు నాయకులు ఉన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంలోని సినిమా టాకీసు చౌరస్తాలో సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చెప్పు చూపించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ బాల్క సుమన్ వెంటనే సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం భిక్కనూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సై సాయికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు భైండ్ల దశరథ్, చేపూరి రాజు, జీడి భూపాల్, అశోక్, మల్లేషం, బొమ్మల శ్రీనివాస్, అమృతారావు, లింగం, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సీఎంపై బాల్క సుమన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఇలాంటి మాటలు పునరావృతం అయితే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుగుణాకర్‌రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, అంబీర్ శ్యామ్‌రావు, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంపై బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యాలను ఖండిస్తూ వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తలారి ప్రభాకర్, నాయకులు స్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్): మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలకు వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయ ప్రదీప్, లోక్యా నాయక్, మల్లయ్యగారి ఆకాష్, తోట రాజు, భూమాగౌడ్ తదితరులున్నారు.



భిక్కనూరులో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



లింగంపేటలో..



నిజాంసాగర్‌లో..



తాడ్వాయిలో..

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకుల మృతి

గాంధారి, ఫిబ్రవరి 6: మండల కేంద్రానికి చెందిన గడ్డమీది మహేష్ (30) సోమవారం తన పశువులను కొట్టుకుని మేపడానికి వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. మహేష్ ఇంటికి కుటుంబీకులు పశువులు వెళ్లిన దారిలో వెళ్లగా కొనాయిపల్లి చెరువు వద్ద చెప్పులు కనపడ్డాయి. చెరువులో వెతుకగా మహేష్ శవమై కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. అదేవిధంగా గాంధారి గ్రామానికి చెందిన చిమల్వార్ శ్రీకాంత్(29) చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. శ్రీకాంత్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ జీవితంపైన విరక్తి చెంది గాంధారి గ్రామ శివారులో ఈ నెల 4న సాయంత్రం గడ్డిమందు తాగాడు. మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.

చెరువులో అభిషేక్ మృతదేహం లభ్యం

బీర్కూర్, ఫిబ్రవరి 6 : మండలంలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చికుర్తి గణేష్(16), వల్లు అభిషేక్(16) అనే ఇద్దరు ప్రాణ స్నేహితులు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని అంకూస్ ఖాన్ చెరువుల్లో గల్లంతు అయిన విషయం విధితమే. అయితే పోలీసులు సాయంత్రం గజ ఈతగాళ్లతో మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టగా రాత్రి గణేష్ మృతదేహం లభ్యమైంది. పోలీసులు వెంటనే మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అభిషేక్ మృతదేహం కోసం అర్ధరాత్రి వరకు గాలించిన లభ్యం కాలేదు. మంగళవారం ఉదయం జాలర్లు చెరువులోకి దిగి గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా అభిషేక్ బీర్కూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. అతని మృతి పట్ల పాఠశాలలో రెండు నిమిషాల పాటు సంతాపం ప్రకటించారు.



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న షబ్బీర్‌అలీ

కాంగ్రెస్‌లో చేరిన 21వ వార్డు కౌన్సిలర్ భర్త

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 6: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు కౌన్సిలర్ తాటి లావణ్య భర్త తాటి ప్రసాద్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పంపరి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు రవి, రవి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆస్పత్రి కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 6: బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో పని చేస్తున్న పేషెంట్‌కేర్, సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులకు రావాల్సిన మూడు నెలల వేతన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ ఏజెన్సీ నిర్వాహకులు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, శానిటేషన్ కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 16న తలపెట్టిన సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమ్రొద్దీన్, సంతోష్, రేణుక, సుశీల, రాజు, కృష్ణ, సురేందర్, తదితరులున్నారు.

ఉత్తమ పాఠశాల పేరెంట్‌గా యశ్వంత్‌రావు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 6 : ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత బాలికల ఉన్నత పాఠశాలలో చదివిన బాలిక తండ్రి యశ్వంత్‌రావుకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తమ పేరెంట్‌గా ఎన్నిక చేశారు. మంగళవారం ఎంఈవో వెంకటేశం విద్యాశాఖ కార్యాలయంలో ఉత్తమ పేరెంట్ ప్రశంస పత్రాన్ని యశ్వంత్‌రావుకు అందజేశారు.



ఉత్తమ పేరెంట్‌గా ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎంఈవో వెంకటేశం

'గృహ జ్యోతి'కి సహకరించాలి

● ట్రాన్స్‌కో ఏఈ అరవింద్

మద్నూర్, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడానికి గాను విద్యుత్ సిబ్బంది ఇంటింటికి తిరిగి వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నారు. మండల కేంద్రంలో గడప గడపకూ ఏఈ అరవింద్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో సిబ్బంది వినియోగదారుల వివరాలు సేకరించారు. ఇందులో భాగంగా వినియోగదారుని ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్‌నెంబర్ ఇస్తే దీనిని సర్వీస్ నెంబర్‌కు అనుసంధానం చేయడం జరుగుతుందని, దీంతో ప్రభుత్వం అమలు చేయనున్న గృహ జ్యోతి పథకం కింద అర్హులైన వారికి 200 యూనిట్లు పొందవచ్చని సూచించారు.



ఇంటింటికి తిరిగి వినియోగదారుల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

విద్యుత్ మీటర్ల వద్ద ఫోన్ నెంబర్ తప్పని సరిగా రాయాలి

ఎల్లారెడ్డి: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ మీటర్లకు అనుసంధానం కోసం తప్పనిసరిగా మొబైల్ నెంబర్ రాయాలని ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ గణేష్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ మీటర్ అనుసంధానం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ జ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్లు ఉచితంగా పొందడానికి వినియోగదారులు బిల్లు కొట్టే (మీటర్ రీడర్‌కు) వారికి ఫోన్ నెంబర్ రేషన్ కార్డు నెంబర్, ఆధార్ కార్డు నెంబర్లను చూపించి మీ యొక్క సర్వీస్ నెంబర్‌కు అనుసంధానం చేయుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన అన్నారు. ఆయనతో పాటు ఏఈ సత్యనారాయణ, లైన్‌మెన్ లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని బాలిక మృతి

మద్నూర్, ఫిబ్రవరి 6: డోంగ్లీ మండలంలోని లింబూర్ వాడి గ్రామానికి చెందిన నాగ్‌నాథ్ కూతురు సాన్విక (6)ను బైక్‌పై తీసుకెళుతుండగా, మద్నూర్ మండలం తడిహిప్పర్గ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో సాన్విక అక్కడికక్కడే మృతిచెందగా, ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాలు కాగా, నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనంపై మద్నూర్ నుంచి డోంగ్లీ మండలం లింబూర్ వాడి గ్రామానికి బైక్‌పై ముగ్గురు వెళుతుండగా ప్రమాదం జరిగినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విఠలేశ్వర ఆలయానికి భూమి పూజ

మద్నూర్, ఫిబ్రవరి 6: మండలంలోని కొడిచిర గ్రామంలో గ్రామస్థులు దళిత వాడలో నిర్మించనున్న విఠలేశ్వరాలయానికి బిచ్కుంద మండలం ఖత్‌గాం మహారాజ్ మల్లికార్జున స్వామి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఆలయాలు పెరుగడం వల్ల ధర్మ రక్షణ పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ నిష్టగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, మాజీ ఎఎంసీ చైర్మన్ సంగమేశ్వర్, ధర్మ జాగరణ కార్యకర్త గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై వేటు

బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 6: మండలంలోని హన్మాజీపేట ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలు రజనీప్రియ సస్పెన్షకు గురయ్యారు. గత నాలుగు నెలలుగా ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అయినందుకు సదరు ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకున్నట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా పాఠశాలలో ఉపాధ్యాయురాలు లేకపోవడంతో పదవతరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.

కాలభైరవ స్వామి ఆలయంలో సింధూర పూజలు

రామారెడ్డి, జనవరి 30: మండలం ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కాల భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోత్సవాల మధ్య భైరవునికి పాలాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభురాం చంద్రంగుప్తా తదితరులు పాల్గొన్నారు.

దుకాణా సముదాయాలకు వేలం

మాచారెడ్డి, ఫిబ్రవరి 6: మండలంలోని వీర హనుమాన్ వెంకటేశ్వర స్వామి దేవస్థాన దుకాణ సముదాయాలలో 20 దుకాణాలకు 18 దుకాణాలకు ఈ నెల 14న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మంగళవారం ఆలయ ఈవో ప్రభు తెలిపారు. వేలంలో పాల్గొనదల్చిన వారు రూ.10వేల దరఖాస్తు రుసుముతో రూమ్ నెంబరు పేరు మీద చెల్లించాలని తెలిపారు.

రైల్వే హద్దులను సరిచేసిన అధికారులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 6: పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇటీవల కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అధికారులకు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం రోడ్డు భవనాల శాఖ అధికారులు రైల్వే అధికారులతో మాట్లాడి రైల్వే హద్దులను పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలకిషన్

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

రాజంపేట, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ బాలకిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 14 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, ప్రత్యేకాధికారుల సాయంతో ఆయా గ్రామాలలో సమస్యలుముందుగానే గుర్తించి పరిశుభ్రతతో పాటు నీటి ఎద్దడి లేకుండా వనరులను ఉపయోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా సానిటేషన్ పరిశుభ్రత రహదారులు శుభ్రం చేయుట చేతులు సేకరించి డంపింగ్ యార్డుకు పంపించడంలాంటి తదితర పనులను చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ రఘురాం, ఏపీఓ భాస్కర్, పంచాయతీకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య వారోత్సవాలను విజయవంతం చేయాలి

భిక్కనూరు, ఫిబ్రవరి 6: ప్రతి గ్రామపంచాయితీలో ఈ నెల 7 నుంచి 14వరకు నిర్వహించే పారిశుధ్య వారోత్సవాలు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భిక్కనూరు ఎంపీవో ప్రవీణ్‌కుమార్ కోరారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తప్పకుండా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి తడి,పొడి చెత్తను తొలగించడంతో పాటుగా రోడ్లను, మురికికాలువలను శుభ్రం చేయ్యడం, నీరు నిల్వ ఉండకుండా చేయ్యడం, ప్రభుత్వ సంస్థల పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు బస్వాపూర్ గ్రామపంచాయితీలో ఎంపీవోను తాజామాజీ పాలకవర్గం సభ్యులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపంచాయితీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దస్తావేజు లైసెన్స్‌లు ఇవ్వాలని వినతిపత్రం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 6: ప్రభుత్వం దస్తావేజు లైసెన్స్‌లు అందించాలని మంగళవారం ఎల్లారెడ్డి సబ్ రిజిష్టర్‌కు దస్తావేజు లేఖలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొంత కాలం నుంచి దస్తావేజు లేఖరులుగా ఉండి పని చేస్తూ ప్రజలకు మావంతు సేవలు అందిస్తూ పరోక్షంగా రిజిస్ట్రేషన్, స్టాంపులా శాఖల ద్వారా ప్రభుత్వానికి సహాయపడుతున్నామని, గత ప్రభుత్వానికి తమకు లైసెన్స్‌లు జారీ చేయాలని విన్నవంచగా వివరాలు సేకరించారు. కానీ ఎలాంటి లైసెన్స్ ఇవ్వలేదని తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున మా సమస్యలన్నీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర వైబ్రేషన్ ఈవెంట్స్

సదాశివనగర్, ఫిబ్రవరి 6: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీకళాశాల కామారెడ్డి నందు స్టేట్ లెవల్ వైబ్రేషన్ రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల పూర్వ విద్యార్థిని మాలవత్ పూర్ణ, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డిలు హాజరయ్యారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రస్థాయి 30 మహిళా డిగ్రీ కళాశాలల నుంచి ఒక్కోకళాశాలకు 15 మంది విద్యార్థునుల చొప్పున ఈవెంట్స్‌లో 24 రకాల సాంస్కృతిక, విద్యాసంబంధిత వ్యాసరచన ముగ్గుల తదితర పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ నిరూప, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ యశోలత, కళాశాల ప్రిన్సిపాల్ రాధిక పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం

● ఆధార్ సెంటర్‌ను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 6: పట్టణ కేంద్రంలో ఒకే ఆధార్ సెంటర్ ఉండటంతో సమయానికి సర్వర్ పని చేయక, ఆధార్ నిర్వాహకులు కూడా సమయ పాలన పాటించకపోవడం వల్ల ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడి కాపులు కాస్తున్నారని ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఒకే ఆధార్ సెంటర్ ఉండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు, ఆధార్ సెంటర్ వద్ద చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రజలు వారి సమస్యలను కాంగ్రెస్ నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించిన నాయకులు ఆధార్ సెంటర్ వద్ద ఉన్న ప్రజలను చూసి సమస్య పరిష్కారానికి మరో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు హజార్ ఖాద్రి, మాజీ జడ్పీటీసీ గయాజుద్దీన్, ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్ చిన్నా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓబీసీ కరపత్రాల ఆవిష్కరణ

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 6: జిల్లా కేంద్రంలోని బీసీ కళాశాల వసతి గృహంలో జరిగిన సమావేశంలో బీసీల ఛలో ఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నీలం నాగరాజు మాట్లాడుతూ.. దేశంలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు లేని సామాజికవర్గం కేవలం బీసీలేనని అన్నారు. బీసీ గణన లేరంటే బీసీల అస్తిత్వమే లేదన్నారు కావున దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో బీసీల గణన చేపట్టాలని, చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లు పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో ఢిల్లీలో ఫిబ్రవరి 8న పార్లమెంట్ ముట్టడి, 9న ఓబీసీ జాతీయ సభకు పెద్దయెత్తున బీసీలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో దయాకర్, మహేష్, అవినాష్, రాహుల్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫిజియోథెరపీ శిబిరం

భిక్కనూరు, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో మంగళవారం ఫిజియోథెరపి శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు నవీన్‌సాయి మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన 10 మంది విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. అనంతరం వైద్యుడు మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయడంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు మహేందర్, శ్యాంరాజ్, పీడీ నర్సింహారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు సునీత, భిక్షపతి, రుక్మిణీ, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్‌లో..

నసురుల్లాబాద్: నసురుల్లాబాద్ భవిత సెంటర్‌లో సమగ్ర శిక్ష కామారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ మనీషా ఇంటి వద్ద చేయాల్సిన వ్యాయామాల గురించి సూచనలు, సలహాలను ఇచ్చారు. ప్రతి మంగళవారం మండలంలో ఉచిత ఫిజియోథరపీ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని, మండల పరిధిలోని పరిసర గ్రామాలకు చెందిన 2-14 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు హన్మాండ్లు, సురేష్, రూప పాల్గొన్నారు.

మహ్మద్‌నగర్‌లో ఎరువుల దుకాణాల తనిఖీ

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), ఫిబ్రవరి 6: మహ్మద్‌నగర్ మండలంలో మంగళవారం ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ తనిఖీ చేశారు. అలాగే గాయత్రి షుగర్ కర్మాగారంలో వద్ద గల ఎరువుల గోదాంను పరిశీలించారు. యూరియా నిల్వలు, నిల్వ పట్టికలు, నిల్వ రిజిష్టర్‌లు పరిశీలించారు. ఆధార్ కార్డు తీసుకుని వచ్చిన రైతులకు ఈపీ వోఎస్ యంత్రం ద్వారా మాత్రమే ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో అమర్ ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి మధుసూదన్ తదితరులున్నారు.

కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ మేనిఫేస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీలతో పాటు ప్రత్యేకంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులు ఏదైన ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా 30 రోజులలోపు అందిస్తామన్నారని అది అమలు చేయాలని అన్నారు. గీత కార్మికులతో పాటు 50 సంవత్సరాలు నిండిన ప్రతీ గీత కార్మికునికి రూ.4వేల చేయూత పెన్షన్ ఇస్తామని, బెల్ట్‌షాపులు రద్దు చేస్తామని అన్నారని అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారుడు నారాగౌడ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న కల్లుగీత కార్మికులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్
ప్రియా 35	- కిస్మత్

బాన్సువాడ

మహేశ్వరి	- అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
వెంకటేశ్వర	- హనుమాన్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

